క్లుప్తంగా

నేడు విజయోత్సవ ర్యాలీ

ప్రొద్దుటూరు కల్చరల్: పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడిచేసి ఉగ్రవాదులను మట్టుపెట్టిన సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చితిరాల నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. భారత సైన్యాన్ని అభినందిస్తూ నిర్వహిస్తున్న విజయోత్సవ ద్విచక్రవాహనాల ర్యాలీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు రామేశ్వరం నుంచి శివాలయం సర్కిల్‌లోని లైటుపాళెం సెంటర్ వరకు ఉంటుందని ఆయన వివరించారు. ర్యాలీలో ప్రజలు, అన్ని సంఘాల నాయకులు, ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

11న నరసింహాస్వామి ఉత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో నరసింహాస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 10న సుదర్శన యోగ నరసింహ స్వామికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు కలశపూజ, గణపతి పూజ, ప్రధాన హోమాలు, 11న స్వామి వారికి 108 కలశాల పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సుదర్శన, లక్ష్మీనరసింహహోమాలు, పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం, 12న ఉదయం 9 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి,అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

అవార్డు ప్రదానం



మంత్రి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంటున్న వార్డెన్ మునెయ్య

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వార్డెన్ బి.మునెయ్యకు ఉత్తమ అవార్డు అందుకున్నారు. బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీఆంజనేయులు చేతుల మీదుగా బీసీ సాంఘీక సంక్షేమ హాస్టల్ నిర్వహణ, అక్కడ చదువుతున్న ఫలితాలు వంటి వాటిపై ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఇదే క్రమంలో ఈ సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో చదువుకుంటూ ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో 600కు 584 మార్కులు సాధించిన విద్యార్థి వెంకట సిద్దార్థను కూడా మంత్రి సన్మానించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



విద్యార్థులతో నీతి కథలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి

అట్లూరు : మండల కేంద్రమైన అట్లూరు శాఖా గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన శిక్షణా తరగతుల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులతో పుస్తక పఠనం, నీతి కథలు, గేమ్స్ ఆడించారు. వేసవి సెలవుల్లో ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞానాన్ని సముపార్జించుకోవాలని గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ సూచించారు. ఈ తరగతుల్లో ముఖ్యంగా విద్యార్థులలో తెలుగు భాషాభివృద్ధి పెంపొందించేందుకు కథలు చదవడం, రాయడం, పుస్తకాలు చదవడం, విలువలు విద్య, డ్యాన్స్, చెస్, జీకే, యోగ మొదలైన అంశాలను నేర్పిస్తారని ఆయన అన్నారు. అలాగే దేశభక్తి గేయాలు, డాన్స్ చేయించారు.

ఎంఎల్‌హెచ్‌పీ వ్యాఖ్యలపై నిరసన



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

బద్వేలు అర్బన్ : వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖలో కీలకంగా పనిచేస్తూ తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఏఎన్ఎంలను, సూపర్‌వైజర్‌లను కించపరిచేలా వ్యాఖ్యానించిన ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ గురువారం సురేంద్రనగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వద్ద ఏఎన్ఎంలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బద్వేలు తాలూకా జాయింట్ సెక్రటరీ సుధాదీరావతి మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేసి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవాలని, అందుకు తాము కూడా సహకరిస్తామని, అలా కాకుండా రెగ్యులర్ ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లపై అవగాహన లేకుండా నోరు పారేసుకోవడం మంచిది కాదని అన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు నాగలక్ష్మి, వసుంధర, లక్ష్మీనారాయణమ్మ, సుబ్బనరసమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

రైతుకు ‘భరోసా’ కరువు

- అన్నదాతను విస్మరించిన కూటమి ప్రభుత్వం
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధి జమ
- విడుదల కానీ రాష్ట్ర ప్రభుత్వ వాటా
- పెట్టుబడుల కోసం అప్పులు చేస్తున్న కర్షకులు



అట్లూరు: చిన్నా పెద్దా తేడా లేకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏడాదికి రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని, అలాగే రైతుకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటామని, ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద నేరుగా రైతుల ఖాతాల్లో జమచేస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నాయకులు హామీలు గుప్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రైతులకు ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఇచ్చే డబ్బులు మాత్రం సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. జిల్లాలో రెండు లక్షలా పది వేలకుపైగా రైతులు ఉన్నారు. వారికి ఏడాదికి రూ.20 వేలు చొప్పున సుమారు రూ.420 కోట్లుపైగా రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా కూటమి ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

గతంలో రైతులకు ఆర్థిక భరోసా

ఖరీఫ్ సీజన్‌లో రైతులు విత్తనాలు కొనుగోలుతో పాటు సాగుకు ఇబ్బంది పడకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాగుకు ముందే పెట్టుబడి సాయం అందిస్తూ అన్నదాతకు అండగా నిలిచింది. అందులో పీఎం కిసాన్ నిధి ద్వారా ఇచ్చే రూ.6 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.7,500 కలిపి రూ.13,500లు వైఎస్సార్ రైతు భరోసా పేరుతో రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది.

మూడు విడతల్లో జమ

గత ప్రభుత్వం ఖరీఫ్ పంట వేసే ముందు అంటే సరిగ్గా మే నెలలో వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 జమ చేసేది. తర్వాత అక్టోబరు నెలలో పంటల కోతతో పాటు రబీ సాగు అవసరాలకు రెండవ విడతగా రూ.4 వేలు. జనవరి నెలలో చివరి విడతగా ధాన్యం ఇంటికి చేరే సమయం సంక్రాంతికి రూ.2వేలు జమ చేసేది. ఇలా మూడు విడతల్లో ఒక్కో రైతుకు రూ.13,500లు చొప్పున గత వైఎస్సార్ ప్రభుత్వం రైతులకు నగదు రూపంలో నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. వైఎస్సార్ రైతు భరోసాతో పాటు వైఎస్సార్ పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీతో గత ప్రభుత్వం రైతులను ఆదుకుంటూ వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇంత వరకూ రైతుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు చెబుతున్నారు.

అరచేతిలో వైకుంఠం చూపారు



చంద్రబాబు ఎన్నికలకు ముందు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా రైతులకు మాత్రం రూపాయి కూడా సాయం చేయలేదు పైగా పంటల బీమాకు మంగళం పాడడంతో ఇన్‌పుట్ సబ్సిడీ ఊసే లేదు.

–చిన్నమునిరెడ్డి రైతు, కామసముద్రం, అట్లూరు మండలం

మాట నిలుపుకున్న జగనన్న



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా రైతులకు రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500లు జమ చేయడంతో పాటు పంటల బీమా ప్రభుత్వమే చెల్లించడంతో రైతులకు లబ్ధి చేకూరింది.

–రాజవోలు సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు, అట్లూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంతవరకూ రైతులకు ఎలాంటి సాయం చేయలేదు. పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇంతవరకూ రైతుల ఖాతాల్లోకి జమచేయలేదు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

–మాలే శివరామిరెడ్డి, రైతు, అప్పరాజుపేట, బద్వేలు మండలం

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా నాల్గవ రోజైన గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమ్మె కారణంగా చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి ప్రస్తుత కూటమి ప్రభుత్వం జీవోలు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, కార్మికులకు వెన్నుదన్నుగా ఉన్న ఆప్కాస్ సంస్థను ప్రైవేటు ఏజెన్సీలకు కట్టబెట్టాలని చూడటం, 60 సంవత్సరాలు నిండిన కార్మికులను బలవంతంగా పదవీ విరమణ చేయించడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదని, ఈ చర్యలన్నీ కార్మిక వర్గాన్ని విస్మరించడమేనని అన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు ఇవ్వాల్సిన రక్షణ పరికరాలను సైతం ఇచ్చేందుకు అనుమతులు లేవని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు కృషి చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు చిన్ని, నాగార్జున, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, దేవమ్మ, సహాయ కార్యదర్శులు సత్యరాజు, ప్రవీణ్‌కుమార్, కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై అగస్త్యేశ్వరుడు



రావణబ్రహ్మ వాహనంపై గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు



నాటక ప్రదర్శనలో కళాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఉత్సవ మూర్తిని రావణబ్రహ్మ వాహనంపై పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరిదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి పూజ, కలశ పూజ, మండపారాధన, దీక్షా హోమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ నటరాజ నాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన మోహినీ భస్మాసుర నాటకం అందరిని ఆకట్టుకుంది. రాత్రి గంగా రాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేసి రావణబ్రహ్మ వాహనం పై కొలువుదీర్చి శివనామ స్మరణల మధ్య పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు, కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యవసాయ భూమి ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలి

కాశినాయన : భూమి కలిగిన ప్రతి రైతు తమ భూమిని ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.జయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయబోతోందని, అందుకు గాను ప్రభుత్వ ఆదేశాల మేరకు వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ లింక్ అయిన రైతుల జాబితాను గ్రామ వ్యవసాయ సహాయకులు శుక్రవారం నుంచి మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ భూములకు ఆధార్ లింక్ అయిన వివరాలు మాత్రమే వ్యవసాయ సహాయకులు పరిశీలిస్తారన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్‌కు భూమి లింక్ అయిందా అనేది మీసేవలో తెలుసుకోవచ్చన్నారు. లింక్ కాకపోతే రెవెన్యూ అధికారులను సంప్రదించి లింక్ చేయించుకోవాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ లింక్ తప్పుగా ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. రైతులు తమ బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింకు, భూమికి ఆధార్ లింకు కలిగి ఉన్న వారు వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ వివరాలను తెలుసుకోవచ్చన్నారు. ఈ నెల 17వ తేదీ లోపు భూమి కలిగిన ప్రతి రైతు లింక్ చేయించుకుని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఆమె కోరారు.

డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితి పెంచాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : డీఎస్సీ అభ్యర్థుల వయో పరిమితిని 47 సంవత్సరాలకు పెంచడంతో పాటు పరీక్షలకు 90 రోజులు గడువు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. గురువారం వారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 7 సంవత్సరాల తర్వాత వెలువడిన నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు పరీక్షలకు సన్నద్ధమవడానికి తక్కువ సమయం ఉండటంతో ఆందోళనకు గురవుతున్నారని, ఇందుకోసం పరీక్షకు కనీసం 90 రోజులు గడువు ఇవ్వాలని కోరారు. అలాగే నార్మలైజేషన్ రద్దు చేసి జిల్లాకు ఒకే ప్రశ్నాపత్రంతో పరీక్ష నిర్వహించడంతో పాటు ఓపెన్ డిగ్రీలో పాసైన వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆదిల్, పట్టణ నాయకులు మనోజ్‌కుమార్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని సన్మానిస్తున్న అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు

బద్వేలు అర్బన్ : బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేయనున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం నిర్మాణానికి రూ.50 వేలు విరాళం అందించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పులివెందులలో ఎంపీని కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ నాగదాసరి చెన్నరాయుడు మాట్లాడుతూ నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ కో కన్వీనర్ జాలాగురయ్య, కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌యాదవ్, ఎస్.ఎం.డి.హసాన్, జయరామ్, దళిత నాయకులు ఓ.వి.ఎస్.ప్రసాద్, మురళి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, నాయకులు

దువ్వూరు : దువ్వూరులో గురువారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామి రెడ్డి పాల్గొన్నారు. సీవీపీ కల్యాణ మండపం, దేవాన్షి ఫంక్షన్ హాలులో దువ్వూరుకు చెందిన యజ్ఞం ఓబులేసు, గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీపతి ఇశ్రాయిల్ వివాహ వేడుకల్లో మాజీ ఎంఎల్ఏ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ సలహాదారులు ఇరగం రెడ్డి తిరుపాల్ రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు రెడ్డి, గుడిపాడు సర్పంచ్ మాబుషరీఫ్,వైఎస్సార్‌సీపీ నాయకులు చిరాకిబాషా, ఇరగంరెడ్డిపద్మనాభరెడ్డి, తుమ్మల మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతో క్రమశిక్షణ

కడప ఎడ్యుకేషన్: క్రమశిక్షణకు, చక్కటి శరీర సౌష్టవానికి ఎన్.సి.సి డ్రిల్ ఉపయోగపడుతుందని 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో నిర్వహిస్తున్న ఎన్.సి.సి ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఎన్.సి.సి క్యాడెట్లకు రైఫిల్ డ్రిల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కల్నల్ సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ పౌరులుగా మెలగడానికి అవసరమైన అన్ని లక్షణాలను క్యాడెట్లు ఈ క్యాంపులో నేర్చుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జే. ఆత్రే, ఎన్.సి.సి అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వ్యర్థాలు తీయక .. దుర్వాసన వీడక





పట్టణంలో చెత్త సమస్య సంక్లిష్టంగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లోని ప్రధాన వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. బద్వేల్ మున్సిపాలిటీలో మినీ కాంపాక్టర్ పట్టణ పరిధిలోని వార్డుల్లో 34 డస్ట్ బిన్ల చెత్త సేకరిస్తుంటుంది. ఇటీవల మినీ కాంపాక్టర్ మరమ్మతులకు గురికావడంతో ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. కూడళ్లలో చెత్త చెదారంతో దుర్వాసన, కుళ్లిన వ్యర్థాలతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీల్లో చెత్తతో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

– బద్వేలు అర్బన్

విద్యతోనే బంగారు భవిష్యత్తు

కడప కల్చరల్ : విద్యతోనే బంగారు భవిష్యత్ లభిస్తుందని తాలూకా సీఐ టి.రెడ్డెప్ప అన్నారు. గురువారం స్థానిక న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ సీఐని మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు ఆధ్యాత్మిక పుస్తకాలు, కరపత్రాలను అందజేశారు. సీఐ టి.రెడ్డప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, సామరస్యాలతో ఒకరినొకరు ప్రేమానుబంధాలు పంచుకోవాలని సూచించారు. పి.రవితేజ, అగస్టిన్, శాంతిరాజు, రోజా తదితరులు పాల్గొన్నారు.

దేశ సంక్షేమానికి పాటుపడుదాం

కడప కల్చరల్ : ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి ఉద్రిక్తతలకు లోను కాకుండా చూడాలని, శాంతిని ప్రగాఢంగా కాంక్షించాలని కడప జిల్లా అర్చక పురోహిత సమైక్య అధ్యక్షులు విజయ్ భట్టర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశ సైనికుల క్షేమం కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేస్తూ దేశాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.

వైభవంగా ముగిసిన ఉత్సవాలు

- వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు
- భారీగా పాల్గొన్న భక్తులు



వీరబ్రహ్మేంద్రస్వామి, ఈశ్వరీదేవి ఉత్సవమూర్తుల ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో జేజినాయన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవాలు మూడు రోజుల పాటు కమనీయంగా జరిగాయి. చివరి రోజైన గురువారం ఉదయం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామికి సుప్రభాత సేవ, అభిషేకం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి నైవేద్యం, మంత్రపుష్ప, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం చేపట్టారు. అలాగే మహాప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు భారీగా పాల్గొన్నారు. ఉభయదారులుగా పులివెందుల నియోజకవర్గం లోపట్నూతల గ్రామానికి చెందిన పుల్లకూర వెంకటపతిగారి అచ్చమ్మ, రామయ్య, పార్థసారథి వీరుడు వ్యవహరించారు. సాయంత్రం సూక్త పారాయణం, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం బ్రహ్మరథోత్సవానికి ఈశ్వరీదేవిమఠం మఠాధిపతులు శ్రీ వీరశివకుమార స్వామి పూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలకు ముత్తలూరు ఆంజనేయశర్మ, రఘువు వెంకటాసుబ్రహ్మణ్యాచార్యులు ఆధ్వర్యం వహించారు. భక్తుల కోసం సౌకర్యాలను ఆలయ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

లింగాలదిన్నెపల్లె భక్తుల సేవ

వీరబ్రహ్మేంద్రస్వామి రథం శుభ్రత బాధ్యతను మండలంలోని లింగాలదిన్నెపల్లె భక్తుడు ఎల్.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన భక్తులు మూడు రోజుల పాటు నిర్వర్తించారు. రథోత్సవం రోజు కూడా వారు కీలకంగా వ్యవహరించారు. రథోత్సవం తర్వాత వర్షం పడడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.



రథంలో ఆశీనులైన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి